ఇంజక్షన్..రియాక్షన్

నక్కపల్లి ఆస్పత్రిలో 23 మందికి అస్వస్థత

డ్యూటీ డాక్టర్ అప్రమత్తం కావడంతో తప్పిన ప్రమాదం

అనంతరం అనకాపల్లిలోని జిల్లా ఆస్పత్రికి తరలింపు

-వార్త 8వ పేజీలో...

జ్వరాల విజృంభణ

జిల్లాలో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

- ప్రతి ఏడాది సగటున మూడు లక్షల మందికి జ్వరం
- జ్వరాలు సోకిన వారిలో కనీసం రెండు వేల మందికి మలేరియా
- ప్రతి ఏడాది ఈ పరిస్థితులు పునరావృతం
- ఆరు నెలల్లో 1,004 మలేరియా కేసులు నమోదు
- ఏడాదిన్నరగా ఏడీఎంహెచ్‌వో పోస్టు ఖాళీ
- పీహెచ్‌సీల పర్యవేక్షణ గాలికి...

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఈ ఏడాది మలేరియా కేసులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ప్రస్తుతం ఏజెన్సీలో ముంచంగిపుట్టు, హుకుంపేట, జి.మాడుగుల, జీకేవీధి, చింతపల్లి, కొయ్యూరు, అనంతగిరి మండలాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది.





చింతపల్లి ప్రాంతీయ వైద్యాలయం వద్ద ఓపీకి బారులు తీరిన రోగులు. (ఇన్‌సెట్లో) చింతపల్లి ఆస్పత్రిలో రోగుల రద్దీ

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న ఏడు లక్షల మందిలో ప్రతి ఏడాది మూడు లక్షల మందికి జ్వరం కచ్చితంగా వస్తుంది. వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లోనూ మన్యంలో మాత్రం గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందని ద్రాక్షగానే ఉన్నాయి. ప్రధానంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక స్థాయి వైద్యం అందించే మెరుగైన పరిస్థితులు లేవు.

దీంతో ఏజెన్సీలో ప్రతి ఏడాది మే నెల నుంచి రోగాలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం ఏజెన్సీలో ముంచంగిపుట్టు, హుకుంపేట, జి.మాడుగుల, జీకేవీధి, చింతపల్లి, కొయ్యూరు, అనంతగిరి మండలాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో సరైన వైద్యం అందని కారణంగా రోగులు చింతపల్లి, అరకులోయ, పాడేరు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. పారామెడికల్ సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవడం, పీజీలో ప్రాధాన్యత కోసం మాత్రమే వైద్యులు ఇక్కడికి రావడం వంటి కారణాలతో పీహెచ్‌సీల్లో పరిస్థితులు అధ్వానంగా ఉంటున్నాయి. డివిజన్ కేంద్రానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో డాక్టర్లు చుట్టపు చూపుగా విధులు నిర్వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఐటీడీఏ కార్యాలయానికి కేవలం పది కిలో మీటర్ల దూరంలో ఉన్న మినుములూరు పీహెచ్‌సీ డాక్టర్, సిబ్బంది తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారని గుర్తించిన గత కలెక్టర్ సదరు డాక్టర్‌ను సరెండర్ చేశారు. అలాగే పలు పీహెచ్‌సీలను ఐటీడీఏ పీవో అభిషేక్ తనిఖీలు చేసిన సందర్భంగా డాక్టర్లు డుమ్మాకొడుతున్న వైనాలు అనేకం వెలుగులోకి వచ్చాయి.



రోగులతో కిటకిటలాడుతున్న ముంచంగిపుట్టు ఆస్పత్రి

ఏడాదిన్నరగా ఏడీఎంహెచ్‌వో పోస్టు ఖాళీ

ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యారోగ్య సేవలను పర్యవేక్షించే బాధ్యతలు చేపట్టే అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి(ఏడీఎంహెచ్‌వో) పోస్టు ఏడాదిన్నరగా ఖాళీగానే ఉంది. గతంలో అనకాపల్లి జిల్లా కేజే.పురం పీహెచ్‌సీలో సీనియర్ వైద్యుడిగా ఉన్న డాక్టర్ కె.లీలాప్రసాద్‌ను డిప్యూటేషన్‌పై స్థానిక ఏడీఎంహెచ్‌వోగా కొన్నాళ్లు విధులు నిర్వహించారు. కానీ ఏడాదిన్నరగా ఇక్కడ ఏడీఎంహెచ్‌వో పోస్టు ఖాళీగా ఉన్నా అధికారులు భర్తీకి ఎటువంటి ... మిగతా 8వ పేజీలో

కాఫీ సాగు మరింత అభివృద్ధి

- తద్వారా క్రమంగా గంజాయి సాగు తగ్గే అవకాశం
- రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



మంత్రి గుమ్మడి సంధ్యారాణికి అల్లూరి సీతారామరాజు ప్రతిమను అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ, తుహిన్‌సిన్హా, ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో రెండున్నర లక్షల మంది కాఫీ సాగు చేపడుతున్నారని, అరకు కాఫీకి దేశం వ్యాప్తంగా గుర్తింపు ఉందని, దానిని మరింత అభివృద్ధి చేస్తూ గంజాయి సాగును క్రమంగా తగ్గించవచ్చునని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మన్యంలో గంజాయి నిర్మూలనపై కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికంగా డబ్బులు వస్తాయనే ఆశతో గిరిజనులు గంజాయి సాగు చేసి జైలు పాలవుతున్నారని, గంజాయి సాగుదారులను పలు మార్లు హెచ్చరించాలని, వినకుంటే కేసులు నమోదు చేయాలన్నారు. ఒడిశాలో గంజాయి సాగు నిర్మూలనపై మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒడిశా సీఎంతో చర్చిస్తారని, ఇదే క్రమంలో గంజాయి సాగుదారుల వివరాలను అధికారులు సేకరించాలని మంత్రి సూచించారు. వారికి ప్రత్యామ్నాయ పంట సాగును ప్రోత్సహించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు గంజాయిని వినియోగించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, పిల్లల వద్దకు గంజాయి చేరకుండా కట్టడి చేయాలన్నారు.

ఐటీడీఏల పూర్వ వైభవానికి కృషి

గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి ఏర్పడిన ఐటీడీఏలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఐటీడీఏల్లో గతంలో ఉన్న 16 పథకాలను పునరుద్ధరిస్తామని, ట్రైకార్ ద్వారా రాయితీపై వ్యవసాయ, ఉద్యానవన పరికరాలు, యంత్రాలు, విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తామన్నారు.

ప్రత్యామ్నాయ పంటలకు రూ.144 కోట్లతో ప్రతిపాదనలు

ఏజెన్సీలో గంజాయి సాగు చేస్తున్న గిరిజన రైతుల కోసం ప్రత్యామ్నాయ పంటల సాగుకు రూ.144 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి మూడేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించామని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. వివిధ రకాల పండ్ల మొక్కలను 18,660 ఎకరాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కాఫీ బోర్డు ద్వారా గిరిజన రైతులకు వివిధ రకాల శిక్షణలు అందించేందుకు, రాయితీ రుణాల పంపిణీకి చర్యలు చేపడతామన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ ఏజెన్సీలో కొయ్యూరు, అనంతగిరి మండలాలు మినహా తొమ్మిది ... మిగతా 8వ పేజీలో

కెందుగూడ పాఠశాల భవనానికి రూ.15 లక్షలు మంజూరు

మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడి

పాడేరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు మండలంలో కెందుగూడ పాఠశాల భవన నిర్మాణానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రూ.15 లక్షలు మంజూరు చేశారని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి బుధవారం విలేకరులకు తెలిపారు. కెందుగూడ పాఠశాలకు భవనం లేకపోవడం, గ్రామస్థులే పాఠశాలకు షెడ్డు నిర్మించుకున్న వైనం పత్రికల్లో చూసి మంత్రి నారా లోకేశ్ చలించిపోయారన్నారు. గిరిజన ప్రాంతంలో భవనాలు లేని 408 పాఠశాలలను గుర్తించి వాటికి భవనాలను నిర్మించేందుకు రూ.56 కోట్లు మంజూరు చేశారన్నారు. అన్ని ఆశ్రమ పాఠశాలల్లో భోజన మెనూ సక్రమంగా అమలు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో విరిగిన పాలు, కుళ్లిన గుడ్లు పెట్టకుండా సరైన పోషకాహారం అందించాలని మంత్రి సూచించారు. ప్రధానంగా బాల్య వివాహాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆశ్రమ పాఠశాలలకు బియ్యం సరఫరా బంద్


అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్న వార్డెన్లు

చింతపల్లి, జూలై 10: జీకేవీధి, చింతపల్లి మండలాల గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన సహకార సంస్థ నుంచి బియ్యం సరఫరా జరగడం లేదు. దీంతో పాఠశాలల పునఃప్రారంభం నుంచి వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. సాధారణంగా ప్రతి నెల ముందుగా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వివిధ పాఠశాలలకు అవసరమైన ఇండెంట్లు పౌరసరఫరాల అధికారులకు పంపించాలి. పౌరసరఫరాల అధికారులు జీసీసీకి రిలీజ్ ఆర్డర్(ఆర్వో)లు జారీ చేస్తారు. ఈ ఆర్వోల ఆధారంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలకు జీసీసీ గోదాముల నుంచి బియ్యం పంపిణీ చేస్తారు. అయితే ఏప్రిల్ నెలకు సంబంధించిన ఇండెంట్ పౌరసరఫరాల అధికారులకు గిరిజన సంక్షేమ శాఖ అధికారుల నుంచి అందలేదు. దీంతో ఏప్రిల్ నెల బియ్యం ఆశ్రమ పాఠశాలలకు విడుదల చేయలేదు. దీని వల్ల వార్డెన్లు పొరుగు పాఠశాలల నుంచి అప్పుగా బియ్యం తీసుకొచ్చి భోజనాలు పెట్టారు. అలాగే జూన్, జూలై నెలలకు సంబంధించిన ఇండెంట్లు సైతం గిరిజన సంక్షేమశాఖ నుంచి అందలేదని పౌరసరఫరాల అధికారులు అంటున్నారు. అయితే సమస్య ఏదైనప్పటికి గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ వసతి గృహాలకు పాఠశాలల పునఃప్రారంభం నుంచి బియ్యం సరఫరా కాలేదు. దీంతో వసతి గృహం డిప్యూటీ వార్డెన్లు, హెచ్‌డబ్ల్యూవోలు కళాశాలల, జీసీసీ గోదాముల నుంచి అప్పుగా బియ్యం తెచ్చుకుని పిల్లలకు వండి పెడుతున్నారు. మరో రెండు రోజుల్లో బియ్యం సరఫరా కాకుంటే ఆశ్రమ పాఠశాలలు మూసివేయడం తప్ప మరో మార్గం లేదని నిర్వాహకులు అంటున్నారు.

అప్పుగానే బియ్యం పంపిణీ

గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలకు అప్పుగానే తక్కువ మొత్తంలో బియ్యం సరఫరా చేస్తున్నామని జీసీసీ డీఎం పి. దేవరాజు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలకు బియ్యం సరఫరా చేయకపోవడంపై డీఎం వివరణ కోరగా పౌరసరఫరాలశాఖ నుంచి ఆర్వోలు రాలేదని, ఈ కారణంగా పాఠశాలలకు బియ్యం సరఫరా చేయలేదన్నారు. వార్డెన్ల అభ్యర్థన మేరకు అప్పుగా కొంత మేరకు బియ్యం వసతి గృహాలకు ఇస్తున్నామన్నారు. ఆర్వోలు విడుదలకాగానే పూర్తి స్థాయిలో బియ్యం సరఫరా చేస్తామని చెప్పారు.

నేడు సీఎం చంద్రబాబునాయుడు రాక



- తొలుత అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలంలో పోలవరం ఎడమ కాలువ పరిశీలన
- అక్కడ నుంచి భోగాపురం విమానాశ్రయ పనుల పరిశీలనకు...
- అనంతరం మెడ్‌టెక్ జోన్‌లో కార్యక్రమాలకు హాజరు
- ఎయిర్‌పోర్టు లాంజ్‌లో అధికారులతో సమీక్ష

విశాఖపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.10 గంటలకు అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 11.15 గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి 11.20 గంటలకు పోలవరం ఎడమ కాలువ వద్దకు చేరుకుంటారు. సుమారు అరగంట పాటు కాలువ పనులను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని 11.55 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి హెలిప్యాడ్‌కు వద్దకు వస్తారు. 12.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ ప్రాంతానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 1.35 గంటలకు అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1.50 గంటలకు పెదగంట్యాడ మండలంలో గల మెడ్‌టెక్ జోన్ మైదానంలో ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రెండు గంటల నుంచి 2.30 గంటల వరకు భోజన విరామం. 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వర్చువల్‌గా సీఐఐ సదస్సుకు హాజరుకావడంతో పాటు మెడ్‌టెక్ జోన్‌లో రెండు భవనాలు ప్రారంభించి అక్కడ ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 4.45 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 4.50 నుంచి ఆరు గంటల వరకు ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో విశాఖ జిల్లాలో ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 6.10 గంటలకు విమానంలో బయలుదేరి రాత్రి గన్నవరం వెళతారు.



దార్లపూడి అక్విడెక్టు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

చంద్రబాబుకు స్వాగత ఏర్పాట్లు

అనకాపల్లి: సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఉత్తరాంధ్ర జిల్లాలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు ... మిగతా 8వ పేజీలో

వారపు సంతలో ట్రాఫిక్ చిక్కులు

- రహదారికి ఇరువైపులా దుకాణాలు
- 40 షెడ్లు అందుబాటులోకి వచ్చినా వినియోగించని వైనం
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

చింతపల్లి, జూలై 10: మండల కేంద్రంలోని వారపు సంత వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రూ.20 లక్షలతో నిర్మించిన 40 సంత షెడ్లు పంచాయతీ అధికారులు వినియోగానికి తీసుకు రాకపోవడంతో రహదారికి ఇరువైపులా వర్తకులు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. ఈ మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడున్నారు.



రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేసి దుకాణాలు

చింతపల్లి వారపు సంత గిరిజన ప్రాంతంలో అతిపెద్దది. గూడెంకొత్తవీధి, చింతపల్లి, జి.మాడుగుల నుంచి అధిక సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. సంతకు వచ్చే వినియోగదారులు ఇక్కడ నెలకొన్న సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతపల్లి వారపు సంత ప్రతి బుధవారం జరుగుతుంది. వర్తకులు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.15 లక్షల నాబార్డు, రూ.5లక్షలు పంచాయతీ నిధులతో నిర్మించిన 40 సంత షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసినప్పటికి వర్తకులందరికి షెడ్లు సరిపడడంలేదని పంచాయతీ అధికారులు వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో వర్తకులు రహదారికి ఇరువైపులా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. సంతకు కేటాయించిన స్థలానికి గత వైసీపీ ప్రభుత్వం చుట్టూ ప్రహరీగోడ నిర్మించి వర్తకులు, వినియోగదారులకు దూరం చేసింది. సంతకు వచ్చే వర్తకులు, వినియోగదారులకు మరుగుదొడ్లు, రక్షిత మంచినీటి సదుపాయం లేదు. వాహనాలు పార్కింగ్ చేసేందుకు కూడా స్థలం లేకపోవడంతో వినియోగదారులు అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో వారపు సంత వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పంచాయతీ అధికారులు ఆశీలు వసూలు చేస్తున్నప్పటి కనీస సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారు.



వారపు సంత వద్ద ట్రాఫిక్ సమస్య

మూడు మండలాల సంత

ఈ సంతకు గూడెంకొత్తవీధి, చింతపల్లి, జి.మాడుగుల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీలు వస్తుంటారు. సాధారణ రోజుల్లో సంతకు ఆరు వేల నుంచి ఎనిమిది వేల మంది వినియోగదారులు వస్తుంటారు. పండగల సమయంలో 15 వేలకు పైగా వినియోగదారులు వస్తుంటారు. ఈ ప్రాంత గిరిజన రైతులు పండించిన వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను సంతలో విక్రయించుకుని వారానికి అవసరమైన నిత్యావసర సరకులను కొనుగోలు చేసుకుని వెళతారు. సంతకు నర్సీపట్నం, కృష్ణాదేవిపేట, తుని ప్రాంతాలకు చెందిన వర్తకులు వస్తుంటారు. సంతలో కూరగాయలు ... మిగతా 8వ పేజీలో

సీలేరు కాంప్లెక్సు ఇన్‌చార్జి ఎస్ఈగా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు



చంద్రశేఖర్‌రెడ్డి

సీలేరు, జూలై 10: సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్(సివిల్)గా పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ బి.చంద్రశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించాలంటూ జెన్‌కో ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్‌ను విజయవాడ విద్యుత్ సౌధాకు బదిలీ చేస్తూ ఆయన స్థానంలో విజయవాడ విద్యుత్ సౌధాలో ఈఈగా ఉన్న రామభద్రరావుకు పదోన్నతి కల్పిస్తూ సీలేరు కాంప్లెక్సు ఎస్ఈగా జెన్‌కో అధికారులు నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే రామభద్రరావు సీలేరు ఎస్ఈగా బాధ్యతలను స్వీకరించడానికి జాప్యం చేస్తున్న నేపథ్యంలో సీలేరు పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించాలని ఆదేశాలు వెలువడడంతో ఆయన బాధ్యతలను స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఇద్దరికి గాయాలు



బోడమ్మ మృతదేహం

సీలేరు, జూలై 10: జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ కమ్మరితోట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుర్తేడు పంచాయతీ చాపరాయి గ్రామానికి చెందిన పలాల లక్ష్మీరెడ్డి(30), పలాల బోడిరెడ్డి(30), అండాల బోడమ్మ(50) డొంకరాయిలో తమ బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి బుధవారం తిరిగి తమ గ్రామం వెళుతుండగా ధారకొండ పంచాయతీ కమ్మరి వద్ద బైక్ అదుపు తప్పింది. దీంతో బైక్ వెనుక ఉన్న బోడమ్మ తలకు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

విద్యుదాఘాతంలో కుక్ మృతి



కుల్‌దీప్ సింగ్ మృతదేహం

అచ్యుతాపురం, జూలై 10: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి సీఐ బుచ్చిరాజు తెలిపిన వివరాలివి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫిరోజాబాద్‌కు చెందిన కులదీప్ సింగ్ (23) సెజ్‌లో గల ఓ కర్మాగారంలో అసిస్టెంట్ కుక్‌గా పనిచేస్తున్నాడు. దిబ్బపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో గల ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం రెండవ అంతస్థులో గోడపై కూర్చొనగా పక్కనే గల విద్యుత్ వైర్లు చేతికి తగలడంతో షాక్ గురయ్యాడు. వెంటనే అతనిని ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందినట్టు సీఐ వివరించారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వెంకన్న ఆలయంలో పట్టపగలు చోరీ

» హుండీ పగులగొట్టి కానుకల అపహరణ



ఆలయంలోని హుండీ

నర్సీపట్నం, జూలై 10: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పట్టపగలు చోరీ జరిగింది. హుండీ తాళాన్ని దొంగ పగులగొట్టి అందులోని కానుకలను అపహరించాడు. దీనికి సంబంధించి ఆలయ ఈవో కె.దివ్యతేజ బుధవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు పూజారి, సిబ్బంది గుడికి తాళాలు వేసి భోజనానికి వెళ్లారు. తిరిగి 5 గంటలకు వచ్చే సరికి మండపం గేటు, హుండీ తాళం పగులగొట్టి ఉన్నాయి. హుండీ తలుపు తెరిచి ఉంది. హుండీ దగ్గరలో కట్టింగ్ ప్లేయర్ ఉంది. ఆలయ ఈవో దివ్యతేజ చోరీ విషయాన్ని మంగళవారం సాయంత్రం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం క్లూజ్ టీమ్ సిబ్బంది గుడిలో వేలిముద్రలు సేకరించారు. ఆలయం తూర్పు ద్వారం తలుపులు వేసినవి వేసినట్టే ఉండడంతో దొంగ గోడ దూకి లోపలికి ప్రవేశించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. గుడిలో మొత్తం ఐదు హుండీలు ఉండగా మండపంలోని హుండీ తెరిచాడు. మధ్యాహ్నం విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో అదను చూసుకొని దొంగ గుడిలోకి ప్రవేశించి, వెనుక భాగంలో ఉన్న సీసీ కెమెరాలు స్విచ్ ఆఫ్ చేశాడు. గుడి గురించి బాగా తెలిసిన వ్యక్తి చేసిన పనే అని అధికారులు భావిస్తున్నారు. అయితే తెరిచి ఉన్న హుండీలో చిల్లర నాణెలు, నోట్లు ఉండడంతో ఈవో ఆధ్వర్యంలో వ్యవస్థాపక ధర్మకర్తల మండలి సభ్యుడు తాటికొండ బ్రహ్మలింగస్వామి, సూపర్‌వైజర్లు బి.శ్రీనివాసరాజు, ఎన్.వెంకటేశ్వరరావు, పోలీసులు, భక్తుల సమక్షంలో వాటిని లెక్కించారు. రూ.59,306 నగదు ఉన్నట్టు నిర్ధారించారు. హుండీలో ఎంత నగదు, కానుకలు అపహరణకు గురయ్యాయో చెప్పలేమని ఈవో తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

నాతవరం, జూలై 10: గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వల్లంపేట జంక్షన్‌లో రెండు కిలోల గంజాయితో ఉన్న పి.సుమన్, జి.బుచ్చిబాబులను మంగళవారం సాయంకాలం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరూ విజయవాడకు చెందినవారుగా గుర్తించినట్టు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందికి జరిమానా

అనకాపల్లి టౌన్, జూలై 10: మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మందికి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున రూ.2.5 లక్షలు జరిమానా విధిస్తూ 13వ ఎంఎం కోర్టు న్యాయమూర్తి టీవీ విజయలక్ష్మి బుధవారం తీర్పు చెప్పినట్టు ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు తెలిపారు. పట్టణంలోని పలుచోట్ల సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేయగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 25 మంది పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చినట్టు చెప్పారు. అలాగే ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనచోదకులు 63 మంది పై కేసులు నమోదు చేసి రూ.6,800 జరిమానాలు విధించామని వివరించారు.

వడ్డిప గ్రామ శివారున 12 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో సీఐ, ఎస్సై తదితరులు

రోలుగుంట, జూలై 10: మండలంలోని వడ్డిప శివారున బుధవారం 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. సీఐ అప్పలనాయుడు, ఎస్సై సురేష్ అందించిన వివరాల ప్రకారం.. పోలీసులకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేసుండగా, రత్నంపేట నుంచి వడ్డిప వైపు వస్తున్న ఆటోను ఆపారు. అందులో 12 కేజీల గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధం ఉన్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులు ముగ్గురు జి.మాడుగుల, చింతపల్లి మండలాలకు, మరో ముగ్గురు బెంగళూరుకు చెందిన వారిగా గుర్తించారు. నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీరు చింతపల్లి నుంచి గంజాయిని కొనుగోలు చేసి తునికి చేర్చడానికి ఆటోను బుక్ చేసుకుని వెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

చోరీకి గురైన సెల్ ఫోన్లు స్వాధీనం



తుని రైల్వే పోలీసులు రికవరీ చేసిన ఫోన్లతో బాధితులు

పాయకరావుపేట, జూలై 10: రైలు ప్రయాణికుల నుంచి చోరీకి గురైన సెల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకున్న తుని రైల్వే పోలీసులు బుధవారం వాటిని ఆయా యజమానులకు అందజేశారు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలివి. తుని, నర్సీపట్నం రోడ్డు, ఎలమంచిలి రైల్వే స్టేషన్ల ప్లాట్‌ఫారంలలో, రైళ్లలో ప్రయాణం చేస్తూ సెల్ ఫోన్లు పోగొట్టుకున్న తుని, పాయకరావుపేటలకు చెందిన పలువురు తుని రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదులు చేశారు. వీటిపై ప్రత్యేక దృష్టిసారించిన రైల్వే పోలీసులు సీఈఐఆర్ సైట్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకుని ఆయా యజమానులకు అందజేఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీష్, హెచ్‌సీ రవి, రామకోటి, బెహరా ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గరీభ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

విశాఖపట్నం, జూలై 10: విశాఖ, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే 12740 నంబరు గల రైలుకు ఈనెల 22వ తేదీ నుంచి విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే 12739 నంబరు గల రైలుకు ఈనెల 23వ తేదీ నుంచి ఈ కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఈ సర్వీసులు 18 థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు, రెండు జనరేటర్ మోటార్స్ కోచ్‌లతో రాకపోకలు సాగిస్తాయన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

కోలుకున్న బాధితులు

» నక్కపల్లి ఆస్పత్రిలో ఇంజక్షన్ వికటించి 23 మందికి అస్వస్థత

» ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలింపు



సిపిటాక్షిమ్ ఇంజక్షన్ల స్టాక్‌ను పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.కల్యాణి

అనకాపల్లి టౌన్, జూలై 10: నక్కపల్లి ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం రాత్రి వైద్య సిబ్బంది ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతో తీవ్ర అస్వస్థతకు గురైన 23 మందికి అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో మెరుగైన వైద్యసేవలందడంతో బుధవారం కోలుకున్నారు. నక్కపల్లి మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు వ్యాధి నివారణ కోసం ఆస్పత్రిలో చేరారు. అయితే మంగళవారం రాత్రి రోగులకు ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతో ఒక్కసారిగా పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడగా, మరికొందరు వణికిపోతూ ఇబ్బందులు పడ్డారు. దీంతో నక్కపల్లి ఆస్పత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి సమయంలో 23 మందిని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అప్పటికే సమాచారం అందుకున్న ఎన్టీఆర్ వైద్యాలయం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వైద్యులను అప్రమత్తం చేశారు. వైద్యాలయానికి వచ్చిన 23 మందికి ముగ్గురు డాక్టర్ల బృందం తమ సిబ్బందితో మెరుగైన వైద్యం అందించారు. వీరిలో కె.సింహాద్రి అనే వ్యక్తి పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై ఇన్‌చార్జి డీసీహెచ్ డాక్టర్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ నక్కపల్లి ఆస్పత్రిలో రోగులకు ఉదయం, మధ్యాహ్నం ఇంజక్షన్లు ఇచ్చారని, దీని వల్ల ఎటువంటి అపాయం జరగలేదన్నారు. రాత్రి ఇచ్చిన ఇంజక్షన్ వల్ల రోగులు అస్వస్థతకు గురయ్యారని, ఇక్కడ మెరుగైన వైద్యసేవలందించడంతో బుధవారం తెల్లవారేసరికి వారంతా కోలుకున్నారని తెలిపారు. అయితే నక్కపల్లిలో ఇచ్చిన ఇంజక్షన్‌లను పరిశీలించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించామని, వారు శాంపిల్స్ తీసి నివేదిక ఇచ్చిన తరువాత డ్రగ్‌లో నాణ్యత లోపిస్తే ఆ బ్యాచ్ మందులను వినియోగించకుండా నిలిపి వేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోగుల పరిస్థితిపై హోంశాఖ మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఫోన్ చేసి అడుగగా అందరూ క్షేమంగా ఉన్నారని సమాచారమిచ్చినట్టు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పిల్లలకు పచ్చకామెర్లు ప్రభావం ఉండడంతో వారు మాత్రం వైద్యం పొందుతున్నారని, మిగిలిన వారంతా డిశ్చార్జి అయ్యారని ఆయన చెప్పారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

నక్కపల్లి: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఇంజక్షన్ వికటించి 23 మంది రోగులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో బుధవారం ఉదయం కలెక్టర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త ఆదేశాల మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.కల్యాణి, డ్రగ్ సప్లయి యూనిట్ ప్రతినిధుల బృందం నక్కపల్లి ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రి డ్రగ్ స్టోర్‌లో వున్న మందులను పరిశీలించారు. రియాక్షన్ వచ్చిందని భావిస్తున్న సిపిటాక్షిమ్ ఇంజక్షన్ల బాక్సులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరిశీలించారు. వీటికి ఎక్స్‌పైయిరీ డేట్ వున్నట్టుగానే గుర్తించారు. ముందు జాగ్రత్త చర్యగా ఈ ఇంజక్షన్లు ఇక ఎవరికీ చేయవద్దని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో వున్న సిపిటాక్షిమ్ ఇంజక్షన్లను సీజ్ చేస్తున్నట్టు ఆమె చెప్పారు.

బాలిక హత్య కేసు నిందితుడ్ని అరెస్టు చేయాలి

» బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

» ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



నిందితుడిని శిక్షించాలని కోరుతూ వినతిపత్రాన్ని పరవాడ డీఎస్పీ సత్యనారాయణకు అందజేస్తున్న ఎమ్మెల్సీ, జడ్పీటీసీలు

రాంబిల్లి, జూలై 10 : మండలంలోని కొప్పుగొండుపాలెంలో హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర బుధవారం పరామర్శించారు. జరిగిన సంఘటన గురించి తెలుసుకుని ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన జరిగిందని ఆరోపించారు. బాలిక తల్లిదండ్రులు నిందితుడు సురేశ్ నుంచి ముప్పు ఉందని చెప్పినా పోలీసులు స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నిందితుడ్ని వెంటనే పట్టుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, రూ.ఇరవై లక్షల పరిహారం చెల్లించాలని, బాలిక సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు రాంబిల్లి పోలీస్ స్టేషన్‌కు నల్లబ్యాడ్జీలు ధరించి వెళ్లారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణను కలిసి బాలిక హత్య కేసు నిందితుడ్ని పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జడ్పీటీసీ ధూళి నాగరాజు, వైసీపీ మండల కన్వీనర్ పి.కిశోర్, మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖకు ఉక్కు మంత్రి

నేడు స్టీల్‌ప్లాంటు సందర్శన

విశాఖపట్నం, జూలై 10 : కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామి బుధవారం విశాఖపట్నం వచ్చారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 7.30 గంటలకు నగరానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి ఆర్ఐఎన్ఎల్ గెస్ట్ హౌస్‌కు వెళ్లి బస చేశారు.

గురువారం ఉదయం తొమ్మిది గంటలకు స్టీల్‌ప్లాంటును సందర్శించి, అక్కడి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.



కేంద్ర మంత్రులను సన్మానిస్తున్న టీడీపీ నేతలు పల్లా శ్రీనివాస్ తదితరులు

లక్ష్యంతో న్యాయ విద్యను కొనసాగించాలి


» విద్యార్థులకు నల్సార్ వర్సిటీ ప్రొఫెసర్ కేశవరావు సూచన



ప్రొఫెసర్ కేశవరావును సత్కరిస్తున్న జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం, జూలై 10: న్యాయ విశ్వవిద్యాలయాల్లో చేరే విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని నల్సార్ వర్సిటీ ప్రొఫెసర్, డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ వీసీ ప్రొఫెసర్ వి.కేశవరావు అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో వీసీ ప్రొఫెసర్ ఎస్.సూర్య ప్రకాశరావు అధ్యక్షతన మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో న్యాయ విద్య ఎంతో భిన్నమైనదన్నారు. మూట్ కోర్టులలో పాల్గొనడం, ప్రాజెక్టులు, డిబేట్‌లతో పాటు వివిధ అభ్యాసనాల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. అంతకు ముందు వీసీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో, అనంతరం రాజ్యాంగం తయారీలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారన్నారు. సమాజానికి ఉపయుక్తమైన న్యాయవాదులుగా తయారు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ సోమా భట్టాచార్య, ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ, ఇతర అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నరసింహావతారంలో జగన్నాథుడు



నరసింహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 10: పట్టణంలోని ఇంద్రద్యుమ్న హాలులో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి బుధవారం నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు బంకుపల్లి సత్యనారాయణ తొలుత స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి, విశేష పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజ సులోచన, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లాలో 513 టీచర్ పోస్టులు ఖాళీ

» త్వరలోనే భర్తీ » డీఈవో వెంకటలక్ష్మమ్మ



చెమ్మచింత హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తున్న డీఈవో

నాతవరం, జూలై 10: జిల్లాలో జిల్లాలో 513 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని త్వరలో భర్తీ చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. బుధవారం ఆమె నాతవరం మండలంలోని పలు పాఠశాలలు సందర్శించి మధ్యాహ్నం భోజనం అమలు, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని నాతవరం, అచ్యుతాపురం, ఎస్.రాయవరంలో జూనియర్ కాలేజీలు అందుబాటులోకి వస్తాయన్నారు. గత ఏడాది కూండ్రం, యలమంచిలి, పాయకరావుపేట, పరవాడలో జూనియర్ కళాశాలలు వచ్చాయన్నారు. అలాగే ఫేజ్-1, ఫేజ్-2ల్లో పాఠశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. చమ్మచింత గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయనిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టామని, నివేదిక ఉన్నతాధికారులకు అందించామన్నారు.

అంతకుముందు డీఈవో చమ్మచింత హైస్కూల్‌కు వెళ్లి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మంచి ఫలితాలు సాధించేందుకు సూచనలు, సలహాలు అందించారు. నోటు పుస్తకాలను పరిశీలించారు. రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు, చమ్మచింత హైస్కూల్ ప్రదానోపాధ్యాయులు కె.శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరాటంకంగా ఇసుక అక్రమ రవాణా



ట్రాక్టర్‌పై తరలిస్తున్న ఇసుక

మాకవరపాలెం, జూలై 10: కొత్త ప్రభుత్వం ఉచిత ఇసుక విదానం ప్రారంభించినప్పటికీ మండలంలో అక్రమ ఇసుక వ్యాపారం యథావిధిగా కొనసాగుతోంది. మండలంలో ప్రతీ రోజూ తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి ఉదయం పది గంటల వరకూ ఈ అక్రమ ఇసుక వ్యాపారం సాగుతుంది. అయితే ఈ ఇసుక తరలింపు స్థానిక పోలీసు స్టేషన్‌కు సమీపంలోనే జరుగుతుండడం గమనార్హం. ప్రస్తుతం మండలంలో టైరుబండి ఇసుక లోడు రూ.1200, ట్రాక్టరు లోడు రూ.4 వేల చొప్పున అమ్మకాలు జరుగుతున్నాయి. టైరు బండ్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్న అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఉచిత ఇసుక విధానం వచ్చినప్పటికీ భవన నిర్మాణదారులకు మాత్రం ఇసుక అంత సులభంగా లభ్యం కావడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ అక్రమ ఇసుక వ్యాపారాన్ని అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా తేలికపాటి జల్లులు

అనకాపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం తేలికపాటి జల్లులు కురిశాయి. వర్షాకాలం ఆరంభమై నెలరోజులు గడుస్తున్నా అనుకున్న స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. దీంతో ఖరీఫ్ సాగుకు ఉపక్రమించిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని మండలాల్లో వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఇప్పటికే వరినారు పోసుకొని సిద్ధం చేసుకున్నారు. కానీ ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆకాశంవైపు ఆశగా చూస్తున్నారు. గడచిన వారం రోజులుగా జిల్లాలో ఎండల తీవ్రతలేకపోయినా గుబురు ఎండతో జనం ఉక్కపోతకు గురై ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బుధవారం జిల్లా కేంద్రం అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాలతో పాటు పలు మండలాల్లో జల్లులు కురిశాయి.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై సమగ్ర సర్వే



సబ్బవరం, జూలై 10 : ప్రభుత్వ భూమి హద్దులు మార్చి, కబ్జా చేశారన్న ఫిర్యాదు మేరకు జిల్లా సర్వేయర్ ఎస్.రాజగోపాలరాజు బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. సబ్బవరం, అనకపల్లి, గొటివాడ గ్రామాల సరిహద్దుల్లో ఉన్న సబ్బవరం సర్వే నెంబరు 271లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో ఆమె వెనువెంటనే స్పందించి ఈ మేరకు చర్యలు చేపట్టారు. సదరు భూముల మ్యాప్‌లను జిల్లా సర్వేయర్ పరిశీలించారు. కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల సర్వేయర్లు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి

» సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన



ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు

నర్సీపట్నం, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెండు నెలల జీతాల బకాయిలు చెల్లించి, సమ్మె అగ్రిమెంట్‌ని అమలు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు పూడి వెంకటరమణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ అబ్జర్వేషన్ కార్యక్రమం సందర్భంగా భోజన విరామ సమయంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. తమకు డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని, గెస్ట్, డైలీ వేజ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. మే, జూన్ నెల జీతాలు మంజూరు చేసి, సమ్మె అగ్రిమెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలుకి కమిటీ ఏర్పాటు, అన్ని విభాగాలకు ఎంటీఎస్ అమలు చేయాని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ రమేశ్, జి చిరంజీవి, అప్పారావు, జ్యోతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'పేట'లో చెలరేగిన దొంగలు

» ఐదు షాపుల తాళాలు పగులగొట్టి సొత్తు పట్టుకెళ్లిన చోరులు

» విధులు ముగించుకుని వస్తున్న హెటెరో ఉద్యోగిపై దాడి



చోరీకి గురైన పాన్‌షాపులు



దొంగలు తొలగించిన గొండెం, ఐరన్ లాక్

పాయకరావుపేట, జూలై 10 : పట్టణంలో మంగళవారం రాత్రి దొంగలు చెలరేగిపోయారు. ఐదు షాపుల తాళాలు పగులగొట్టి దొరికినకడకు దోచుకుపోయారు. అంతేకాకుండా అర్ధరాత్రి విధులు ముగించుకుని నుంచి వస్తున్న హెటెరో కంపెనీ ఉద్యోగిపై దాడిచేసి భయభ్రాంతులకు గురిచేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... పాయకరావుపేటలోని మంగవరం రోడ్డులో గల జడ్పీ బాలికోన్నత పాఠశాల ఎదుట నుంచి రెండు పాన్ షాపుల తాళాలను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. చిల్లర నోట్లు, సామాన్లు పట్టుకుపోయారు. అదేవిధంగా సమీపంలో ఉన్న మాల్ ఎదుట తాళాలు విరగ్గొట్టి ఐస్ క్రీమ్‌లు, డ్రింక్‌లు పట్టుకెళ్లారు. మెయిన్‌రోడ్డులోని గౌతమ్ స్కూల్ ఎదుట టీ టైమ్, పక్కనే ఉన్న మిల్క్ పార్లర్ షట్టర్ల తాళాలు విరగ్గొట్టి చోరీకి ప్రయత్నించారు. అయితే వాటిలో పెద్దగా వారికి ఏమీ దొరకలేదు. అదేవిధంగా హెటెరో కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగి విధులు ముగించుకుని అర్ధరాత్రి మంగవరం రోడ్డులో ఇంటికి వెళుతుండగా నలుగురు ఆకతాయిలు వెంబడించి దాడిచేశారు. గంజాయి బ్యాచ్ రాత్రిపూట తిరుగుతూ పట్టణంలో దొంగతనాలు, ఒంటరిగా వస్తున్నవారిపై దాడిచేసి దోచుకుంటున్నారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా జరిగిన సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు అందకపోయినా విషయం తెలుసుకుని దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా, హెటెరో ఉద్యోగిపై దాడిచేసిన వారిని గుర్తిస్తున్నామన్నారు. అదేవిధంగా జడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద జరిగిన పాన్ షాపులో దొంగతనాలకు సంబంధించి పాఠశాల ఎదుట ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ద్వారా దొంగలను గుర్తించి అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఇకపై పట్టణంలో గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.



మోదకొండమ్మను పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి

మోదకొండమ్మను దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి

పాడేరు రూరల్, జూలై 10: గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అల్లూరి జిల్లాకు మొదటిసారి వచ్చిన గుమ్మడి సంధ్యారాణికి కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి అమ్మవారి పాదాలను దర్శించుకున్నారు. అనంతరం నేరుగా మోదకొండమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయానికి వచ్చిన మంత్రి సంధ్యారాణికి ఎన్డీఏ కూటమి నాయకులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు. కూటమి నేత, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు నియోజకవర్గ సమస్యలను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, మాజీ మంత్రి మణికుమారి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.కృష్ణారావు, కె.రాఘవేంద్రరావు, మఠం శాంతికుమారి, టి.సత్యవతి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్



విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట, జూలై 10: ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని పెదగరువు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారా? సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు చేయించారా? లేదా? అని పాఠశాల యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన దేశించారు. అనంతరం ఆయన విద్యార్థులకు భోజనాలు వడ్డించి పాఠశాల సిబ్బంది, విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని పాల్గొన్నారు.

గిరిజనులకు చక్కని సేవలు అందించాలి: ఎమ్మెల్యే

అరకులోయ, జూలై 10: ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తూ గిరిజనులకు చక్కని సేవలు అందించాలని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. మండలంలోని గన్నెల పీహెచ్‌సీ, గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సర్పంచ్ బొజ్జయ్యతో కలిసి బుధవారం సందర్శించారు. ముందుగా పీహెచ్‌సీకి వెళ్లి రోగులను పరామర్శించారు. వైద్య సేవలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. మారుమూల ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వస్తున్న గిరిజనులకు వైద్యులు ఓర్పుతో సేవలను అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. అనంతరం సమీపంలో ఉన్న బాలకల ఆశ్రమో న్నత పాఠశాలను సందర్శించి పిల్లలతో పాఠ్య పుస్తకాలు చదివించే ప్రయత్నం చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వసతిగృహంలో వంటకాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమిడి అశోక్, రామూర్తి, రామారావు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు: ఎంఈవో

జి.మాడుగుల, జూలై 10: ఉపాధ్యాయులు పాఠశాలలకు గైర్హాజరైతే చర్యలు తప్పవని ఎంఈవో బాబూరావుపడాల్ హెచ్చరించారు. కొక్కిరాలిపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని మారుమూల వెన్నెలకోట, మర్రిపాలెం, కిముడుపల్లి, దేవరపల్లి, బల్జిపేట పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న ప్రమాణాలపై ఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేయడంతో పాటు విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించారు. మధ్యాహ్న భోజనం మెనూ అమలు తీరు, వసతి సదుపాయాలు, నాడు-నేడు తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతీ రోజు సమయానికి పాఠశాలలకు హాజరుకావాలని సూచించారు. అలాగే 'నేను బడికి పోతా' కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు.

కుస్తీ అకాడమీ విద్యార్థులకు పీవో అభినందన

కొయ్యూరు, జూలై 10: తమిళనాడులోని మిట్లూరులో గత నెల 28, 29 తేదీలలో జరిగిన అండర్-23 సౌత్ జోన్ జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో పతకాలు సాధించిన కొయ్యూరు రెజ్లింగ్ అకాడమీ విద్యార్థులను ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేకంగా అభినందించారు. పతకాలు సాధించిన విద్యార్థులు పాలిక బుజ్జిబాబు, మద్దూరి రమణ, గంధంతో పాటు కోచ్ అంబటి నూకరాజు ఐటీడీఏ పీవోను కలిశారు. ఈ సందర్భంగా వారిని పీవో అభినందించి అకాడమీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాక్షించారు. విద్యార్థుల శిక్షణకు అవసరమైన సహాయ సహకారాలు ఐటీడీఏ ద్వారా సమకూరుస్తామని ఈ సందర్భంగా పీవో హామీ ఇచ్చినట్టు కోచ్ నూకరాజు తెలిపారు.

ఇంజక్షన్..రియాక్షన్

» నక్కపల్లి ఆస్పత్రిలో 23 మందికి అస్వస్థత

» డ్యూటీ డాక్టర్ అప్రమత్తం కావడంతో తప్పిన ప్రమాదం

» అనంతరం అనకాపల్లిలోని జిల్లా ఆస్పత్రికి తరలింపు

నక్కపల్లి, జూలై 10: అనకాపల్లి జిల్లా నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులకు మంగళవారం రాత్రి సిబ్బంది ఇచ్చిన ఇంజక్షన్లు వికటించాయి. సుమారు 23 మందికి జ్వరం తీవ్రం కావడంతో పాటు వాంతులు అవ్వడంతో డ్యూటీ డాక్టర్ జయలక్ష్మి గుర్తించి నిమిషాల వ్యవధిలో ఎవిల్, డెక్సడ్రాన్ ఇంజక్షన్లు ఇవ్వడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం అందరినీ ప్రత్యేక అంబులెన్స్‌ల్లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా వుందని నక్కపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష చెప్పారు.

నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలోని జనరల్ వార్డులో మంగళవారం రాత్రి సుమారు 30 మంది ఇన్‌పేషెంట్లుగా ఉన్నారు. యథావిధిగా జ్వరం, నీరసం తగ్గేందుకు సిబ్బంది యాంటీ బయాటిక్ ఇంజక్షన్ సిఫోటాక్జిమ్ సహా మెట్రోజల్, సిప్రోఫ్లాక్సిన్ ఇచ్చారు. ఇంజక్షన్లు చేసిన వెంటనే మొదట ఆరుగురికి జ్వరం తీవ్రం కావడంతో పాటు వాంతులు అయ్యాయి. ఆ తరువాత కాసేపటికి మిగిలిన రోగులలో కూడా ఈ లక్షణాలు కన్పించాయి. సిఫోటాక్జిమ్ ఇంజక్షన్ వల్లే రియాక్షన్ వచ్చినట్టు ప్రాథమికంగా వైద్యాధికారులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే పలువురు నాయకులు నక్కపల్లి ఆస్పత్రికి చేరుకున్నారు. హోంమంత్రి వంగలపూడి అనితకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్, ఉపమాక దేవస్థానం మాజీ ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఫోన్ చేసి విషయం చెప్పారు. వెంటనే హోం మంత్రి జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించి, సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. రియాక్షన్ నుంచి రోగులను కాపాడేందుకు ఎవిల్, డెక్సడ్రాన్ ఇంజక్షన్లు చేసిన అనంతరం హెటిరో సహా ఇతర అంబులెన్స్‌ల్లో రోగులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇతర వ్యాధుల తీవ్రతతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన బుచ్చిరాజుపేటకు చెందిన సింహాద్రి అనే వ్యక్తి పరిస్థితి విషమంగా వుండడంతో అనకాపల్లి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు వైద్యాధికారులు చెప్పారు. రియాక్షన్ వచ్చిన రోగుల్లో ఐదుగురు చిన్నారులు ఉండడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన చెందారు. బుధవారం ఉదయం నాటికి వారి పరిస్థితి నిలకడగా ఉండడంతో ఊపిరిపీల్చుకున్నారు.

సమస్యలపై మంత్రికి వినతుల వెల్లువ



మంత్రికి సమస్యలపై వినతులు అందిస్తున్న వివిధ సంఘాల నాయకులు

పాడేరు రూరల్, జూలై 10: గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత జిల్లా కేంద్రం పాడేరుకు మొదటిసారి వచ్చిన గుమ్మడి సంధ్యారాణికి వివిధ సంఘాల నాయకులు, ప్రజలు సమస్యలతో కూడిన వినతులు అందించారు. కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం బయటకు వచ్చిన మంత్రికి వినతులు వెల్లువెత్తాయి. గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు తదితరులు తమ ప్రాంత వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, జీవో నంబర్ 143ను రద్దు చేయాలని, కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, శతశాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని, పీహెచ్‌సీల్లో ఖాళీలను భర్తీ చేయాలని, ఏఎన్ఎంలకు హెచ్‌వీ ప్రమోషన్ ఇవ్వాలని వినతిపత్రం అందించారు. సీఆర్టీల సంఘం జిల్లా అధ్యక్షుడు దలపతి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు దొబ్బేటి బాలకృష్ణ మంత్రిని కలిసి రాష్ట్రంలో సీఆర్టీల సమస్యలను వివరించగా, పరిష్కారానికి హామీ ఇచ్చారని తెలిపారు. పెదబయలు మండలం వనబంగా గ్రామంలో పాఠశాల భవనం లేక పదేళ్లుగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను జనసేన నాయకుడు జాగరపు పవన్‌కుమార్ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రం అందించారు. ఏజెన్సీలో పోస్టులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొరతో కలిసి జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. గిరిజన ప్రాంత కళాశాలల్లో సీట్లు పెంచాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతీ గిరిజన విద్యార్థికి సీటు ఇవ్వాలని, మండలాల్లో గురుకుల బాలికల కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నారావు, వరహాలరావు తదితరులు మంత్రికి వినతిపత్రాన్ని అందించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల కూటమి నాయకులు పలు సమస్యలపై మంత్రికి వినతులు అందించారు. వీటిపై సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

రేవళ్లులో పాఠశాల ఏర్పాటు చేయరూ..

కొయ్యూరు, జూలై 10: రేవళ్ల పంచాయతీ కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని సర్పంచ్ జనుమూరు వెంకటలక్ష్మి కోరారు. ఈ మేరకు టీడీపీ నేతలు అప్పలరాజు, స్వామి తదితరులతో కలిసి బుధవారం ఎంఈవో రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఐదేళ్ల క్రితం వరకు గ్రామంలో లూథరిన్ ఎయిడెడ్ పాఠశాల ఉండేదని, అనివార్య కారణాలతో పాఠశాల మూతపడడంతో గిరిజన చిన్నారులు విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 200 మందికి పైబడి విద్యార్థులు ఉన్నారని, వారంతా ఆరు నుంచి పది కిలోమీర్ల దూరంలో ఉన్న కొయ్యూరు, కాకరపాడు, రాజేంద్రపాలెం తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై దూర ప్రాంతంలో పాఠశాలలకు పంపించలేక, ఇంటివద్ద ఉంచుకోలేక సతమతమవుతున్నారని ఎంఈవోకు వివరించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో పాఠశాల ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బొడ్డగొంది పాఠశాల పనులు పూర్తిచేయాలి

ముంచంగిపుట్టు, జూలై 10: జర్రెల పంచాయతీ బొడ్డగొంది గ్రామంలో అసంపూర్తి పనులతో నిలిచిపోయిన పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ కోరారు. బుధవారం గ్రామాన్ని సందర్శించి రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు కింద రూ.12 లక్షలు నిధులు మంజూరయ్యాయని, అయితే భవన నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయిని తెలిపారు. నిధులు మంజూరైనా పనులు ఎందుకు జరగడంలేదని విద్యా శాఖ అధికారులను ప్రశ్నించారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

గంజాయి జోలికి వెళ్లొద్దు: ఏవో

ముంచంగిపుట్టు, జూలై 10: గంజాయి వంటి మత్తు పదార్థాల సాగు జోలికి ఎవరూ వెళ్లరాదని, వాటిని విడనాడాలని వ్యవసాయ శాఖ అధికారి (ఏవో) శ్రీనివాస సూచించారు. పోలీసు, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని బాబుసాల సచివాలయం పరిధిలోని బల్లుగూడ గ్రామంలో బుధవారం నిర్వహించారు. అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటల సాగుపై గిరి రైతులకు అవగాహన కల్పించారు. ప్రత్యామ్నాయ పంటలైన సిల్వర్ ఓక్, కాఫీ, మిరియాలు, జీడిమామిడి, బత్తాయి పెంపకంపై దృష్టిసారించాలని సూచించారు. గంజాయి వల్ల సాగుదారులతో పాటు ఇతర కుటుంబాలు సైతం రోడ్డున పడే ప్రమాదం ఉందని, దూరంగా ఉంటే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో నారీమణి, మహిళా పోలీసు భార్గవి శైలజ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన

పాడేరు రూరల్, జూలై 10: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను సంఘటిత పోరుతోనే అడ్డుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక సంఘాలతో కలిసి ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్మిక హక్కులను కాలరాసే చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్కీం వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ కేవీ మురళీకృష్ణ. చంద్రబాబు సందర్శించనున్న ఎస్.రాయవరం మండలం దార్లపూడి అక్విడెక్టు ప్రాంతాన్ని ఇప్పటికే పరిశీలించి స్వాగత ఏర్పాట్లను పర్యవేక్షించారు. దార్లపూడిలో హెలిప్యాడ్ పనులను అధికారులు పరిశీలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు, బీజేపీ నేతలు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్ల పరిశీలన

ఎస్.రాయవరం: మండలంలోని దార్లపూడి వద్ద అసంపూర్తిగా ఉన్న అక్విడెక్టును పరిశీలించడానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు రానుండడంతో సీఎం పర్యటించే ప్రాంతాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ మురళీకృష్ణతో బుధవారం పరిశీలించారు. చంద్రబాబు పరిశీలించనున్న అక్విడెక్టు వద్ద ఏర్పాట్లను, ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేస్తున్న ఫొటో ఎగ్జిబిషన్ ప్రదేశాన్ని, మీడియా పాయింట్‌ను అనిత పరిశీలించడమే కాకుండా బారికేడ్లతో పాటు తదితర ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెలిప్యాడ్ ప్రదేశాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.

కాఫీ సాగు మరింత అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

మండలాల్లో గతంలో 7,500 ఎకరాల్లో గంజాయి పంటను సాగు చేసేవారన్నారు. పోలీసు శాఖ ప్రత్యేక చర్యల్లో భాగంగా పరివర్తన కార్యక్రమం ప్రభావంతో దానిని 1,039 ఎకరాలకు తగ్గించామన్నారు. గంజాయి సాగు చేసిన రైతులు, గంజాయి పండించిన భూములకు సంబంధించిన వ్యక్తులపైనా కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం మంత్రి గుమ్మడి సంధ్యారాణికి కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో అల్లూరి సీతారామరాజు ప్రతిమను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో అభిషేక్, జీసీసీ ఎండీ సురేశ్‌కుమార్, డీఆర్వో పద్మావతి, ఏఎస్పీ ధీరజ్, ఎస్ఈబీ డీఎస్పీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డివిజన్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

... 5వ పేజీ తరువాయి

బలమైన గాయమైంది. దీంతో ఆమెను ధారకొండ పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆమె పరిస్థితి విషమయంగా ఉండడంతో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తుండగా మృతి చెందింది. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో వారికి ధారకొండ సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు.



పెదబయలులో మానవహారం



చింతపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

సమస్యలపై కదంతొక్కిన అంగన్‌వాడీలు

అరకులోయ/ముంచంగిపుట్టు/పెదబయలు/చింతపల్లి/గూడెంకొత్తవీధి, జూలై 10: ఏజెన్సీలోని పలు మండలాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ అంగన్‌వాడీలు శుక్రవారం కదంతొక్కారు. అరకులోయ, ముంచంగిపుట్టు, పెదబయలు, చింతపల్లి, గూడెంకొత్తవీధి తదితర మండలాల్లో ఆందోళన బాట పట్టారు. అఖిలభారత కోర్కెల దినం సందర్భంగా డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ఆయా మండలాల్లోని తహసీల్దారుల కార్యాలయం ఎదుట దిగారు. పెదబయలు మండల కేంద్రంలో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలకు, స్కీమ్ వర్కర్ల జీతాలు పెంచాలని, సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. డుంబ్రిగుడ మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. చింతపల్లిలో సీఐటీయూ నేత పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల చట్టాలను పరిరక్షించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాన పనికి సమాన వేతనం అందించాలతిని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపట్టలేదు. దీంతో ఏజెన్సీలోని పీహెచ్‌సీలు, హెల్త్ సబ్ సెంటర్ పనితీరుపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా మెతక వైఖరి కారణంగా డాక్టర్, సీనియర్ పారామెడికల్ సిబ్బంది మొక్కుబడిగా విధులు నిర్వహిస్తుండగా, కాస్త పలుకుబడి ఉన్న సిబ్బంది అక్రమ డిప్యూటేషన్లతో కాలం గడుపుతున్నారు. దీంతో గత కొన్నాళ్లుగా ఏజెన్సీలో పీహెచ్‌సీల పనితీరును పట్టించుకునే నాథులే లేని దుస్థితి కొనసాగుతున్నది. ఏజెన్సీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రం ఉన్న గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లోనూ ఆశ కార్యకర్తలు పని చేస్తున్నారు, క్షేత్ర స్థాయిలో తక్షణ వైద్యం, గ్రామాల్లో రోగాల పరిస్థితులపై వారే పారామెడికల్ సిబ్బందికి, వైద్యులకు సమాచారం ఇస్తారు. దీంతో ఏజెన్సీలో వైద్య సేవలకు ఆశ కార్యకర్తలు, పారామెడికల్ సిబ్బందే కీలకం. అయితే వారిని పర్యవేక్షించి గ్రామ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాల్సిన వైద్యులే నిర్లక్ష్యంగా ఉండడంతో ఆశించిన ఫలితం దక్కడం లేదు.

ఈ ఏడాది రికార్డు స్థాయిలో మలేరియా కేసులు

గత ఐదేళ్లతో పోలిస్తే ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఆరు నెలల్లోనే 1,004 మలేరియా కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి పీహెచ్‌సీల్లో నమోదయ్యే కేసుల్లో రెండు వంతులకు తగ్గించి రికార్డుల్లో నమోదు చేస్తున్నప్పటికీ ఈ ఏడాది కేవలం ఆరు నెలల్లోనే వెయ్యి మలేరియా కేసులు నమోదు కావడం విశేషం.

మలేరియా నివారణకు చేపట్టాల్సిన చర్యలు

- ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేకంగా శాశ్వత మలేరియా నివారణ అధికారిని నియమించాలి.
- దోమల నివారణకు ఉపయోగించే మందును ప్రతి ఏడాది మార్చి నెలలోనే ఉన్నతాధికారులు సమకూర్చాలి.
- ప్రతి ఏడాది ఏప్రిల్ రెండో వారం నుంచే దోమల నివారణ మందును పిచికారీ చేయాలి.
- దోమల ఉత్పత్తి పెరగకుండా దోమల గుడ్లను లార్వా దశలోనే నాశనం చేసే యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియను సక్రమంగా చేపట్టాలి.
- మొక్కుబడిగా కాకుండా ప్రతి పల్లెలోనూ దోమల నివారణ మందు పిచికారీ చేయాలి.
- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను పిచికారీ పనుల్లో భాగస్వాములను చేయాలి.
- మలేరియా నివారణకు చేపట్టే చర్యల్లో పక్కాగా సహకరించాలని వైద్యారోగ్యశాఖ సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయాలి.
- ఏజెన్సీలో మలేరియా వ్యాప్తి, మరణాలపై వాస్తవాలను అధికారులు గ్రహించాలి. తప్పుడు లెక్కలు, మరణాలపై అవాస్తవ ప్రకటనలు వంటి చర్యల వల్ల మలేరియా నివారణ చర్యలకు విఘాతం కలుగుతుందని ఉన్నతాధికారులు గుర్తించాలి.
- గిరిజనులకు జ్వరం వచ్చిన వెంటనే మలేరియా పరీక్ష, వైద్య సేవలు అందించాలి.

ఐదేళ్లుగా మలేరియా కేసుల వివరాలు (పీహెచ్‌సీల్లో నమోదైనవి)

వ.సం	సంవత్సరం	జ్వర బాధితుల రక్త నమూనాలు	మలేరియా కేసులు
1.	2020	3,90,461	1,153
2.	2021	4,01,117	733
3.	2022	4,05,544	714
4.	2023	3,82,778	1,811
5.	2024	1,85,226	1,004 (జూన్ 30 వరకు)

వారపు సంతతో ట్రాఫిక్ చిక్కులు

... 5వ పేజీ తరువాయి

మొదలుకొని దుస్తులు, ఫ్యాన్సీ వస్తువులు, కిరాణ, తదితర అన్ని రకాల దుకాణాలను వర్తకులు ఏర్పాటు చేస్తున్నారు. వారపు సంత ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుంది. దీంతో ఈ సమయంలో వారపు సంత ప్రాంగణం రద్దీగా కనిపిస్తుంది.

సంతకు స్థలంలో ప్రహరీ గోడ నిర్మించడంతో..

సంతకు వచ్చే వర్తకులు పాత బస్టాండ్ నుంచి డిగ్రీ కళాశాల వరకు రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రెవెన్యూశాఖ, గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలకు వెళ్లేదారిలో సంత కోసం గత ప్రభుత్వం 2.5 ఎకరాల స్థలం కేటాయించింది. అయితే సంతకు కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ గోడను నిర్మించారు. ఈ స్థలంలో లోపలకు ఎవరూ రాకుండా గేట్లు ఏర్పాటు చేశారు. దీనికి తోడు రూ.20 లక్షల నాబార్డు, పంచాయతీ నిధులతో నిర్మించిన షెడ్లు సైతం వినియోగానికి తీసుకురాలేదు. ఈ దుకాణాల షెడ్లు కొంత మంది వర్తకులకు అప్పగిస్తే కొంత సమస్య తీరేది. కానీ రూ.లక్షల నిధులతో నిర్మించిన సంత షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం అత్యంత సుందరంగా నిర్మించిన ఈ సంత షెడ్లు మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారాయి.

బుధవారం వస్తే ట్రాఫిక్ సమస్య

పాత బస్టాండ్ నుంచి డిగ్రీ కళాశాల మైదానం వరకు రహదారికి ఇరువైపులా వర్తకులు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రహదారి ఇరుకుగా మారింది. దీనికి తోడు సర్వీసు ఆటోలు, లోడ్ వాహనాలు సంత జరిగే ప్రాంతంలో ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింతగా పెరిగిపోతున్నది. దీని వల్ల ఈ మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు.

వర్షం కురిస్తే చిత్తడే..

వర్షం కురిస్తే వారపు సంత చిత్తడిగా మారిపోతుంది. సంతలో దుకాణాలు రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వర్షం కురిస్తే వర్తకులు దుకాణాల్లో ఏర్పాటుచేసి సామగ్రిని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కొంత మంది సామగ్రి తడిసిపోకుండా కవర్లు కప్పుతున్నారు. అయితే అధిక వర్షం కురిస్తే సామగ్రి పూర్తిగా తడిసిపోతుంది. దీని వల్ల వర్షం కురిస్తే సంత రద్దు అయ్యే పరిస్థితి నెలకొంటోంది.

సంక్షిప్తంగా..

ప్రతీ ఆఖరు శుక్రవారం ఉద్యోగుల (మీ) కోసం...

» జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సైతం మీ కోసం కార్యక్రమాన్ని ప్రతీ నెలలో ఆఖరు శుక్రవారాన్ని కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ శుక్రవారం ప్రజల సమస్యలపై వినతులను స్వీకరించేందుకు మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇకపై ప్రతీ నెల ఆఖరు శుక్రవారం సాయంత్రం మూడు గంటల తర్వాత ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

పర్యాటక కేంద్రాలకు డబుల్ రోడ్లు

» పంచాయతీరాజ్ శాఖ డీఈఈ రామన్



మాట్లాడుతున్న డీఈఈ రామన్

అరకులోయ, జూలై 10: అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పర్యాటక కేంద్రాలకు డబుల్ రోడ్లు వేయనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ రామన్ తెలిపారు. పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. అనంతగిరి మండలంలోని బొర్రా గేటువలస నుంచి కటికి జలపాతం వరకు రూ.12.97 కోట్లతో ఏడు మీటర్ల తారు రోడ్డును నిర్మిస్తున్నట్టు చెప్పారు. అలాగే అరకులోయ మండలంలోని బోసుబెడ్డ నుంచి వయా మాడగడ మీదుగా సన్‌రైస్ హిల్ పాయింట్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.5.52 కోట్లు, హుకుంపేట మండలంలోని మత్స్యపురం నుంచి మత్స్యగుండం వరకు రూ.4.5 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ రహదారిలో అవసరమైన రక్షణ గోడలు, కాలువలు, సీసీ ర్యాంప్‌లు నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు.

రూ.7.2 కోట్లతో అభివృద్ధి పనులు

అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఎమ్మెల్యే కోటా కింద రూ.7.2 కోట్లు మంజూరు చేసినట్టు డీఈఈ రామన్ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన ఈ నిధుల్లో మండలానికి రూ.1.2 కోట్లు చొప్పున కేటాయించినట్టు చెప్పారు. ఈ నిధులతో ప్రహరీ గోడలు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు తదితర పనులు చేపడతామన్నారు. ఆరు మండలాల్లో సుమారు 77 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు డీఈఈ వివరించారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన రమేశ్‌నాయుడు



పాడేరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ.రమేశ్‌నాయుడు అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని నారా లోకేశ్ హామీ ఇచ్చినట్టు కేవీ.రమేశ్‌నాయుడు తెలిపారు.

సీలేరు ఓఅండ్ఎం ఎస్ఈగా చిన్నకామేశ్వరరావు బాధ్యతలు



సీలేరు, జూలై 10: సీలేరు కాంప్లెక్సు ఓఅండ్ఎం ఎస్ఈగా ద్రోణంరాజు చిన్నకామేశ్వరరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఓఅండ్ఎం ఎస్ఈగా కొనసాగిన ఎస్ఎస్ మీరాను ఆర్‌టీపీపీకి జెన్‌కో ఉన్నతాధికారులు బదిలీ చేసి, ఆర్‌టీపీపీలో ఈఈగా పని చేస్తున్న చిన్నకామేశ్వరరావును ఉద్యోగోన్నతిపై నియమించారు. దీంతో మోతుగూడెం కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈఈ బాలకృష్ణతో పాటు పలువురు ఇంజనీర్లు అతనికి శుభాకాంక్షలను తెలిపారు.

రంగురాళ్ల తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు: సీఐ

» 14 మందిపై బైండోవర్ కేసులు

చింతపల్లి, జూలై 10: సిగినాపల్లి రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని గూడెంకొత్తవీధి సీఐ బి.అప్పలనాయుడు హెచ్చరించారు. బుధవారం రింతాడ పంచాయతీలోని కడుగుల గ్రామానికి చెందిన 14 మందిపై తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ కేసులు పెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్వారీలో కొంత కాలంగా వ్యాపారుల ప్రోత్సాహంతో కూలీలు తవ్వకాలు సాగిస్తున్నారన్నారు. గతంలో క్వారీ వద్ద తవ్వకాలు సాగిస్తూ కూలీలు మృతి చెందారని, దీంతో రిజర్వుడ్ ఫారెస్టు ప్రాంతంలో క్వారీని నిషేధించారని చెప్పారు. క్వారీ వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పెదవలస రేంజ్ అధికారి శివరంజిని, ఎస్ఐ అప్పలసూరి, ఫారెస్టు సెక్షన్ అధికారి నూకరాజు, ఎఫ్‌బీవో భూషణం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.మాడుగుల, జూలై 10: మండలంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ అధికారి ఏపీఎస్ఎం.అప్పారావు తెలిపారు. పాడేరు నుంచి జి.మాడుగుల వరకు జరుగుతున్న హైవే రోడ్డు పనుల కారణంగా 33 కేవీ విద్యుత్ లైన్‌లో సాంకేతిక లోపం ఏర్పడిందని, అందువల్ల మండలంలో కరెంట్ సేవలు నిలిపివేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

కొయ్యూరు, జూలై 10: కొయ్యూరు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాలలో 20 సీట్లలో ఖాళీ ఉన్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో స్వయంగా లేదా 9490957225 నంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.